క్లుప్తంగా

అమరేశ్వరుని సేవలో మంత్రి ఉషాశ్రీచరణ్



అమరావతి: ప్రఖ్యాత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామివారిని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉషాశ్రీచరణ్‌కు ఆలయ ఈవో వేమూరి గోపినాధ శర్మ, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. అమరేశ్వర స్వామి వారికి, బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రి ఉషాశ్రీచరణ్ దంపతులకు స్వామివారి శేషవస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేసారు.

అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో మాలధారులకు చద్ది

41 రోజులు ఉచిత అన్నదానం



క్రోసూరు: అయ్యప్పస్వామి మాలధారులకు ప్రతి ఏటా క్రోసూరులోని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మధ్యాహ్నం చద్ది(అన్నదానం) కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. స్థానిక వీరభద్ర మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 11 సంవత్సరాలుగా శ్రీ అయ్యప్ప సేవా సమితి మాలధారులకు 41 రోజుల పాటు మధ్యాహ్న అన్నదాన(చద్ది) కార్యక్రమం నిర్వహిస్తుంది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చద్దికి కావాల్సిన బియ్యం 45 క్వింటాళ్లు అందచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. చద్ది కార్యక్రమం డిసెంబర్ 12వ తేదీ వరకు జరుగుతుందని కమిటీ సభ్యులు వివరించారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ ట్యాంక్ అందజేత



క్రోసూరు: క్రోసూరు జెడ్పీ పాఠశాల నీటి అవసరాలు తీర్చేందుకు స్థానిక స్విమ్స్ పాఠశాల డైరెక్టర్ మక్కెన గోవర్ధన్, ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి 1500 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానపాధ్యాయులు రామాంజనేయులు, ఉపాధ్యాయులు చంద్రోశేఖరరెడ్డి, చిల్కా సురేష్‌బాబు, బాబూరావు, విద్యార్థులు పాల్గొని దాతలకు కృతజ్ఞతలు తెలియచేసారు.

దాడిపై కేసు నమోదు

ముప్పాళ్ళ: పాత గొడవల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.కిశోర్‌బాబు గురువారం తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇరుకుపాలెం గ్రామానికి చెందిన బత్తుల సుశీల, దరువూరి వెంకాయమ్మ కుటుంబాల మధ్య స్థల వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో సుశీలపై వెంకాయమ్మ, ఆమె మనుమడు సాయిలు దాడి చేసి గాయపరిచారు. సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఏ బాలకృష్ణ గురువారం తెలిపారు. గ్రామంలో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.4,400లు సీజ్ చేశామన్నారు.

ఈ నెల 4వ తేదీ వరకు రైల్వే గేటు మూత

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీనివాస కాలనీ సమీపంలో ఉన్న రైల్వే గేటు ఈ నెల 4వ తేదీ వరకు తెరవబడదని పిడుగురాళ్ల రైల్వే మాస్టర్ అంజయ్య గురువారం తెలిపారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ నుంచి న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ వరకు ఇంజనీరింగ్ వర్క్ జరుగుతుందని, వాహన రాకపోకలు జరిగితే పనులకు అంతరాయం ఏర్పడుతుంది కనుక ఈ నెల 2వ తేదీ నుంచి నెల 4వ తేదీ వరకు రైల్వే గేటును మూసి వేయటం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోవాలని అన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి శివాలయం సెంటర్‌లో గురువారం మంచినీటి కోసం బోరు వేశారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి మంచినీటి సమస్యను గ్రామస్తులు తీసుకెళ్లారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తక్షణమే బోరు వేయించాలని సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావుకి ఎమ్మెల్యే కాసు సూచించారు. దీంతో సర్పంచ్ కోటేశ్వరరావు యుద్ధ ప్రాతిపదికన బోరు వేయించారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డిల ప్రత్యేక పూజల అనంతరం బోరు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజారోగ్యమే పరమావధిగా పాలన



మందుల కిట్ పంపిణీ చేస్తున్న చల్లంచర్ల, సూరిబాబు, కమిషనర్ షమ్మి



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు
- పట్టణంలోని 9,10 వార్డులకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సత్తెనపల్లి: ప్రజారోగ్యమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 9, 10 వార్డుల ప్రజలకు నాగార్జున నగర్‌లోని తెలగ హాస్టల్‌లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి కార్పొరేట్ వైద్యం పేదలకు అందేలా చేస్తే ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రజలకు ఇంటి ముంగిటే మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరం నిర్వహించడమే కాక అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. జగనన్న విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మార్చారన్నారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటుతో పల్లెల్లో, పట్టణాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, 104 వాహనాల సేవలతో గ్రామీణులకు వైద్యంపై భరోసా వచ్చిందన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ జి.ధర్మసింగ్ శాస్త్రి, డాక్టర్ రవి శంకర్ రెడ్డి, డాక్టర్ ధీరజ్, డాక్టర్ పీవీడీఎస్ఆర్ సుబ్బారావులు 616 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్త శాతం, షుగర్ పరీక్షలను 27 మందికి నిర్వహించారు. మలేరియా, ఈసీజీ పరీక్షలు ఆరుగురికి చేశారు. అదనపు వైద్య పరీక్షల నిమిత్తం 10 మందిని జిల్లా వైద్యశాలకు రిఫర్ చేశారు. 95 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 40 మందికి కళ్ళజోళ్ళు పంపిణీకి సిద్ధం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో 9,10 వార్డుల కౌన్సిలర్లు చుక్కా శాంతి శ్రీ సాగరిక, పెద్దింటి గోవిందమ్మ, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), చుక్కా మోషే, ఈపూరి బ్రహ్మరెడ్డి, తోట లక్ష్మీనారాయణ, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోళ్లూరు ప్రసన్నాంజనేయుని ఆలయ అభివృద్ధికి కృషి

- సుమారు రూ.3 కోట్లతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం
- నెలరోజుల్లో ఆలయ పనులు ప్రారంభిస్తాం
- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఆలయ నిర్మాణానికి భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నాయకులు

బెల్లంకొండ: తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ ప్రసిద్ధ ఆలయమైన కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. గురువారం మండలంలోని బెల్లంకొండ క్రాస్‌రోడ్డు వద్ద గల స్వామి వారి దేవస్థానంలో ఎమ్మెల్యే శంకరరావు, దేవదాయ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులతో కలసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వారికి పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కోళ్లూరు నుంచి స్వామి వారిని 2013 సంవత్సరంలో మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద కేటాయించిన స్థలంలోకి తరలించారు. స్థానికంగా బాలాలయాన్ని నిర్మించి, గత పదేళ్లుగా స్వామి వారికి పూజలు చేస్తున్నారు. ప్రసిద్ధ ఆలయాలలో ఒకటైన ప్రసన్నాంజనేయుని ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఉన్నట్లు ఎమ్మెల్యే శంకరరావు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం 2.28 ఎకరాల భూమిని కేటాయిస్తూ కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రూ.3 కోట్లతో ఆలయ నిర్మాణానికి కొద్ది రోజులలో భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భూమి సరిహద్దులను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధ ఆలయాలకు దీటుగా ఆలయాన్ని నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ సహకారంతో పాటు దాతలు, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో అమరావతి అమరలింగేశ్వర సామి ఆలయం, మాదిపాడు సత్తెమ్మతల్లి ఆలయం, కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాలు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉన్న ఆలయాలని తెలిపారు. ఈ ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి, దేవదాయ శాఖ ఈవో వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, ట్రస్ట్ బోర్డు సభ్యులు కొండెబోయిన రాజు, మల్లయ్య, ప్రత్తి శ్రీనివాసరావు, జీడీఎంస్ డైరెక్టర్ పాల్వాయి ఆదినారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గంగిరెడ్డి ప్రతాప్ రెడ్డి, దారం రమణారెడ్డి, నరసింహా నాయక్, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి చింతారెడ్డి సాయిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి వజ్రం వజ్రగిరి జస్టిస్

- సీనియర్ న్యాయవాది పిన్నమనేని
- చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌కు సత్కారం



సత్కారం అందుకుంటున్న చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్

సత్తెనపల్లి: సత్తెనపల్లి వజ్రం వజ్రగిరి జస్టిస్ అని సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, 46 జాతీయ అవార్డులు, 6 అంతర్జాతీయ అవార్డులు పొందిన వజ్రగిరి జస్టిస్‌ను ఉషోదయ కళాపరిషత్, రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభకు పిన్నమనేని పాములయ్య అధ్యక్షత వహించారు. పాములయ్య మాట్లాడుతూ ఎంత ఎదిగిన ఒదిగి ఉండే ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడం సత్తెనపల్లి ప్రజానీకం, ప్రముఖులు, కళాకారులందకీ గర్వకారణంగా ఉందన్నారు. జస్టిస్ వేసే చిత్రలేఖనాలు అర్థవంతంగానూ, ఆదర్శవంతంగానూ, సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా ఉన్నాయన్నారు. సత్తెనపల్లి ఖ్యాతి ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లిన ఘనత జస్టిస్‌కే దక్కిందన్నారు. ప్రముఖులు, రంగస్థల నటులు, కవులు, రచయితలు జస్టిస్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత వజ్రగిరి జస్టిస్ మాట్లాడుతూ ఈ చిత్రలేఖనాల విద్య నా తల్లి ఇచ్చిన పాలల్లోనూ, తండ్రి చూపిన ప్రేమలోనూ అబ్బాయని నా గురువు నా తండ్రేనని గర్వంగా చెప్పారు. ముందుగా ఆయన తల్లిదండ్రులను స్మరించుకున్నారు. ఈనాటి వరకు తాను వేసిన చిత్రాలు అర్థవంతమైనవి, ఆలోచింపజేసేవేనని, అర్థరహితమైనవి, అర్ధనగ్న చిత్రాలను వేయనన్నారు. ఇకముందు కూడా అలాంటి చిత్రాలనే వేస్తానన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, రంగస్థల నటులు సీతారామయ్య, రాంబాబు, మాతంగి సాంబశివరావు, రచయిత కె.ఆంథోనీ, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు యిర్మియా, సీఐటీయూ నాయకులు ఆర్ పురుషోత్తం, సిద్ధార్థ శ్రీనివాసరావు, ఆర్టిస్టు నందిగం నాగయ్య, వి.ప్రభాకర్, రిటైర్డ్ ఉద్యోగి ప్రసాద్, న్యాయవాది గుమ్మస్తాలు రామకోటయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిష్టతో ఆత్మల పండుగ

అచ్చంపేట: మరణించిన బంధువులు, స్నేహితులు, పూర్వీకులను గుర్తుతెచ్చుకుని, వారి ప్రేతాత్మలు శాంతించాలని కోరుతూ మండలంలోని చెరుకుంపాలెంలో గురువారం ఆత్మల సంరక్షణ దినాన్ని జరిపారు. గ్రామస్తులు శ్మశానవాటికల్లో వారికి సంబంధించిన వారి సమాధులను అందంగా అలంకరించారు. వారి గొప్పతనాన్ని, చిన్నతనంలో వారి ద్వారా పొందిన స్నేహపూర్వక ప్రేమానురాగాలను, వారి సేవలను, కుటుంబ అభివృద్ధికి వారి కృషిని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సమాధుల వద్ద ఆత్మలు శాంతించేందుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ పుట్టి అంతోని రాజు, ఫాదర్ కిరణ, ఫాదర్ ఏరువ రాజారెడ్డి తదితరులు బైబిల్ పఠనం చేసి మరణించిన వారంతా స్వర్గంలోని దేవుని వద్దకు వెళతారని, బతికున్న రోజులలో ప్రతి ఒక్కరికి మంచి చేయాలని, దయాగుణం, దానగుణం కలిగి ఉండాలని బోధించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

నేడు భూములు కోల్పోయే రైతులతో సమావేశం

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 3వ తేదీన కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మాదల, ఇరుకుపాలెం గ్రామాలకు చెందిన రైతులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో అవార్డు ఎంక్వయిరీ వినతులు, పరిష్కార మార్గాలపై చర్చించవచ్చన్నారు. సమావేశానికి రైతులు, వారి తరపు ప్రతినిధులు, ఆసక్తిగల వ్యక్తులు, లీగల్ ప్రతినిధులు కూడా పాల్గొనవచ్చన్నారు. సమావేశానికి వచ్చే రైతులు భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు నకలు, భూమి పట్టాదారు పాసుపుస్తకం నకలు, టైటిల్‌డీడ్, ఇతరత్రా ధ్రువపత్రాలు తీసుకొనిరావాలన్నారు. మొత్తం 143 మంది పట్టాదారు రైతులు భూములు కోల్పోతున్నట్లుగా గుర్తించామన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రామాలయంలో పూజలు



సత్తెనపల్లి: దేశం, రాష్ట్రం, జిల్లా, మన ఊరు సుభిక్షంగా ఉండాలని పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లోని కోదండ రామాలయంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి రామాయణం పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య నేతృత్వంలో ప్రసాద వితరణ చేపట్టారు.

స్మార్ట్ విధానంలో బోధన అభినందనీయం

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ట్రస్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి



దేచవరంలోని ఆదర్శ పాఠశాలలోవిద్యార్థులతో కూర్చొని పాఠ్యాంశాలు వింటున్న రవీంద్రనాథ్‌రెడ్డి

నకరికల్లు: ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు మెరుగు పరుచుకుంటే మరింత ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ట్రస్ట్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలోని ఆదర్శ పాఠశాల, చల్లగుండ్ల అడ్డరోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. 6,7 తరగతుల వారితో కలసి కూర్చొని పాఠాలు విన్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఇంగ్లీష్‌లో రీడింగ్ సామర్థ్యం పెంచడంపై పలు సూచనలు చేశారు. పాఠ్య పుస్తకాలలోని సిలబస్ గురించి విద్యార్థులను, ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఐఎఫ్‌పీ వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ విధానంలో పాఠ్యాంశాల బోధన తీరును అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో -2 ఎమ్ఎల్ ప్రసాద్, మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఓ రత్నాకర్

మాచవరం: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రత్నాకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాల పట్ల చేపట్టాల్సిన వైద్య సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి తెలియజేశారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే, ఉన్నత ఆసుపత్రులకు సిఫారసు చేయాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. గ్రామ విలేజ్ క్లినిక్‌లో రిపోర్టులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదరావు, సిబ్బంది హరీష్, శివమ్మ, వీరయ్య, చిన్నారిరోజి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ప్రతి రోజు నివేదిక ఇవ్వాలి

ముప్పాళ్ళ: ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పుల వివరాలపై ప్రతి రోజు నివేదిక అందించాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 4,5 తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా ఎలక్షన్ కమిషన్ చేపట్టిందని, ఆయా తేదీల్లో బూత్‌లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాలలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి రోజు అందిన అర్జీలను ఆన్‌లైన్ చేసి నివేదిక అందించాల్సి ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఆర్‌ఐలు పవన్‌కుమార్, కపిల్, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మిరపలో బెట్ట పరిస్థితులపై అవగాహన



దమ్మాలపాడులో మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ జనని

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ప్రస్తుతం ఉన్న బెట్ట వాతావరణం నుంచి మిరప పంటను కాపాడుకొనేందుకు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ జనని చెప్పారు. మండలంలోని దమ్మాలపాడు, బొల్లవరం గ్రామాల్లోని మిరపపంటను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. బెట్ట ఎదుగుదలను అధిగమించి మిరప మొక్కలు ఎదుగుదల పెంచుటకు గాను యూరియా 10-20గ్రాములు/ పొటాషియం నైట్రేట్ 2.5గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారం రోజులకు ఒకసారి పిచికారీ చేయాలన్నారు. భూమిలో వేసే స్థూల పోషకాల మిశ్రమం (19:19:19) 5 గ్రాములు, ఆగ్రోమిన్‌మ్యాక్స్ 2.5గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే బెట్ట పరిస్థితుల్లో మొక్కకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. తద్వారా ధృడంగా, ఆరోగ్యవంతంగా పెరిగిన మొక్కలు రసం పీల్చే పురుగుల ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులును తట్టుకునే శక్తి కలిగి ఉంటాయి. రసం పీల్చు పురుగులైన తామర పురుగు, పేనుబంక, తెల్లదోమ పురుగుల నివారణకు సూచించిన పురుగుమందులు పిచికారీ చేసి అదుపులో ఉంచాలి. అవసరాన్ని బట్టి సూచించిన పురుగుమందులను మార్చి మార్చి పిచికారీ చేస్తే పురుగుల ఉధృతిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. సూచించిన పద్ధతిలో ప్రస్తుతం నెలకొన్న బెట్ట పరిస్థితిలో మిరప లాభదాయకంగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆమెతో పాటు సచివాలయ ఉద్యానవన శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన ఓటు హక్కును నమోదు చేసుకోండి

తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి



పిడుగురాళ్ల: ఓటు హక్కు లేని వారు నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి గురువారం తన కార్యాలయంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27వ తేదీన ఓటర్ల జాబితా విడుదల అయిందని, ఈ జాబితాలో ఓటు హక్కు పొందని వారు ఎవరైనా ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చునని, ఆన్‌లైన్‌లోనైనా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఫారం 6 ద్వారా నూతన ఓటు, ఫారం 7 ద్వారా తొలగింపులు, ఫారం 8వ ద్వారా అడ్రస్ మార్పులు, చేర్పులు, అక్షర దోషాలకు సంబంధించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లతో(బీఎల్‌వోలతో) ఈ నెల 11, 12 తేదీలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఆయా బూత్‌ల వద్ద నిర్వహించటం జరుగుతుందని ఆ సమయంలోనూ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలోని 17 మంది లబ్ధిదారులకు రూ.17.25 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. గురువారం ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పేరుపేరునా వారి చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్నీ విధాలుగా సహాయపడుతూ ఆరోగ్య భద్రతపై భరోసా కల్పిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు చికిత్సకు తగిన ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు. దీని వలన ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ విద్యా, వైద్యంకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. ఎవరైనా సరే వైద్యఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు



విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థినులు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో గత నెల 30న అమరావతిలో నిర్వహించిన ఖోఖో పోటీలలో ఆర్ అంజలిబాయి, కె.ఝాన్సి గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరిమంజుల గురువారం తెలిపారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లా చిగిజర్లలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన జూడో అండర్-19 పోటీలలో 36 కేజీల విభాగంలో ఎం.పుష్పలత సిల్వర్ మెడల్, 63 కేజీల విభాగంలో కె.ప్రియాంక, 70 కేజీల విభాగంలో ఎం.దీపిక బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ మేరి మంజుల, వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, పీడీ మహబూబి, పీఈటీ నసీమ, ఉపాధ్యాయినులు చెంచులక్ష్మి, పుష్పలత అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎస్ఈబీ సిబ్బంది వినుకొండ రూరల్ మండల పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎస్ఈబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో గోకనకొండ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని అందులోని 8 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ట్రాక్టర్లను, డ్రైవర్లు అంకమశెట్టి చంద్రశేఖర్ (వేల్పూరు), వల్లెం అంకమ్మరావు (గోకనకొండ)లను అదుపులోకి తీసుకొని వినుకొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయ భాస్కర్‌రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో బైక్ చోరీ

నరసరావుపేట టౌన్: అది నరసరావుపేటలోని బస్టాండ్ ప్రాంతం.. వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా.. వచ్చే పోయే వాహనాలకు సందు లేదు.. ఆ రోడ్డు పక్కనే వరుసగా ఆగిన బైకుల్లో ఒక బైకుపై ఓ వ్యక్తి దర్జాగా కూర్చొని స్టైల్‌గా సిగరెట్ వెలిగించాడు. మరో ఐదు నిమిషాలకు మరో బైక్ పైకి మారాడు. ఒక్క పది నిమిషాలలో ఆ బైక్ మీద కూర్చున్న వ్యక్తి లేడు. ఆ బైకూ లేదు. ఇది నరసరావుపేటలో బైక్ చోరీల నిందితుల హవా. కొంతకాలంగా నరసరావుపేటలో బైక్ దొంగతనాలు విపరీతంగా పెరిగిపోయాయి.నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వరుసగా ద్విచక్ర వాహనాలు అపహరణకు గురవుతుండటంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. బైక్ చోరీ ముఠా చాకచక్యంగా తమ పని కానిచ్చేస్తున్నారు. తాజాగా గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆగంతకుడు దర్జాగా ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లాడు. యడ్లపాడు గ్రామానికి చెందిన శివరామకృష్ణ ఆర్టీసీ బస్టాండ్‌లో తన బైక్‌ను నిలిపి,గంట తర్వాత వచ్చే సరికి కనిపించలేదు. కార్గో పార్శిల్ సర్వీస్ వద్ద సీసీ ఫుటేజ్ పరిశీలించగా ముఖానికి రుమాలు కట్టుకున్న యువకుడు వాహనాన్ని అపహరించుకెళ్లాడు. సమాచారాన్ని వాహన యజమాని వన్‌టౌన్ పోలీసులకు అందించాడు. దీంతో సిబ్బంది ఘటనా స్థలంలో సీసీ ఫుటేజ్ సేకరించారు. నిందితుడి ఆచూకి కోసం గాలిస్తున్నారు.